క్లుప్తంగా

అగస్త్యేశ్వరాలయానికి భారతి గ్రీనరీ



ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన గ్రీనరీ, చెట్టు

కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి భారతి సిమెంట్స్ గ్రీనరీ ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన శివరాత్రి మహోత్సవానికి విచ్చేసిన భారతి పరిశ్రమ ప్రతినిధులను స్థానికులు ఆలయంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన భారతి ప్రతినిధులు పరిశ్రమ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో వెలుపల, లోపల గ్రీనరీ ఏర్పాటు చేశారు. అలాగే అక్కడక్కడా చెట్లు వేయడంతో మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. అడిగిన వెంటనే ఆలయ ప్రాంగణంలో గ్రీనరీ ఏర్పాటు చేసిన భారతి యాజమాన్యానికి, ప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు గృహసారథుల సమావేశం

చక్రాయపేట : మండలంలోని గృహసారథులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులకు వేంపల్లె మధురెడ్డి కల్యాణ మండపంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు మొదలయ్యే ఈ సమావేశానికి కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలంలో పార్టీకి సంబంధించిన వారందరూ హాజరు కావాలని కోరారు.

దళితుల హక్కుల కోసం పోరాటం చేయాలి

మైలవరం (జమ్మలమడుగు రూరల్): దళితులు హక్కుల కోసం పోరాటం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. ఆదివారం మైలవరం మండల పరిధిలోని ఎం కంబాలదిన్నె గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాదిగ దండోర జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దళితులు ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుమలయ్య, విజయ్‌కుమార్, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరాశ పరచిన తెల్ల కుసుమ



కోత దశలో ఉన్న తెల్ల కుసుమ పంట

పెద్దముడియం : మొదటి, రెండో పంటగా సాగు చేసిన తెల్ల కుసుమ దిగుబడి రైతులను నిరాశపరిచింది. కొందరు రైతులు రబీ మొదట్లో పంటను సాగు చేశారు. మరి కొందరు ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము పంట కోత అనంతరం రెండో పంటగా తెల్ల కుసుమ సాగు చేశారు. ప్రస్తుతం కోత దశలో ఉంది. ఎకరాకు కేవలం రెండు క్వింటాళ్ల దిగుబడి వస్తోందని, ధర కూడా రూ.4000 మాత్రమే ఉందని రైతులు చెబుతున్నారు.

10 నుంచి గంగమ్మ బోనాల పండుగ


కడప కల్చరల్ : కడప నగరం రాజారెడ్డివీధిలోని గ్రామ దేవత గంగమ్మ ఆలయ 18వ బోనాల పండుగను ఈనెల 10 నుంచి 12వ తేదీవరకు నిర్వహించనున్నారు. 10న ఉదయం 4.30 గంటల నుంచి అమ్మవారి మూలమూర్తికి 108 బిందెల పసుపు నీటితో అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం నవగ్రహాల పూజ, శాంతిహోమం, సాయంత్రం కుంకుమార్చన, అమ్మవారి మహా జ్యోతుల పూజ నిర్వహిస్తారు. 11న ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారు. భక్తులు అమ్మవారికి చల్లను సమర్పిస్తా రు. సాయంత్రం 6 గంటలకు ఊయల సేవ ఉంటుంది. 12న ఉదయం 5 గంటలకు అభిషేకం అనంతరం బోనాల సమర్పణ నిర్వహిస్తారు. అనంతరం నిజరూప దర్శనం, సాయంత్రం 6 గంటలకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

కడప కల్చరల్ : జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని ఏడురోడ్ల సమీపాన చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నరసింహామూర్తి, కార్యదర్శి ఖ్వాజా మస్తాన్ దీనిని ప్రారంభించారు. వేసవి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు హర్షణీయమని వారు పేర్కొన్నారు. సంస్థ పట్టణ అధ్యక్షులు రియాజ్‌బాష మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా శాఖ సంఘ సేవ కార్యదర్శి జాకీర్ హుసేన్, రహమతుల్లా, ఇతర సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక ఊరు తయారవుతోంది..!

- జగనన్న కాలనీలో వేగంగా గృహ నిర్మాణాలు
- 2955 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు



అంబవరం సమీపంలోని జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

జమ్మలమడుగు : జమ్మలమడుగు శివారులో ఒక ఊరు తయారు అవుతోంది. మున్సిపాలిటీ పరిధిలో 2316 మంది ఇళ్లు లేని నిరుపేదలకు అంబవరం సమీపంలో ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. ఇళ్లు కట్టుకోవాలంటూ లబ్ధిదారులకు వలంటీర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో వారు ముందుకు వస్తుండటంతో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

వివిధ దశల్లో నిర్మాణాలు

జమ్మలమడుగు మున్సిపాలిటీలో 2316 మందికి ఇళ్లు మంజూరు చేశారు. అందులో బేస్‌మట్టం కింది వరకు (భూమి లెవల్‌కు) పూర్తి చేసిన వారు 330 మంది ఉన్నారు. బేస్‌మట్టం లెవల్ వరకు 1502 మంది పూర్తి చేశారు. రూఫ్ లెవల్ 296, ఆర్‌సీ లెవల్ వరకు 116, మరో 71 మంది ఇళ్లను పూర్తిగా నిర్మించుకున్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ఖాతాలలో బిల్లు (డబ్బు) పడుతుండటంతో పనులు వేగవంతంగా జరిగాయి. అంతేకాకుండా శాసనసభ్యుడు డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇళ్లను నిర్మించుకోవాలంటూ ప్రచారం చేస్తుండటంతో లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు.

జిల్లాలో టాప్‌లో ఉన్నాం

జమ్మలమడుగు నగర పంచాయతీ ఇళ్ల నిర్మాణాలలో జిల్లాలోనే టాపర్‌గా నిలిచాం. 2316 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాం. అందులో రెండు వేల మందికిపైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటి వరకు 71 పూర్తయ్యాయి. మరో ఐదు వందలు త్వరగా పూర్తి కానున్నాయి. 1500 బేస్‌మట్టం పూర్తి చేశారు. వీలైనంత త్వరగా పనులను లబ్ధిదారులతో చేయిస్తున్నాం. – జి.వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, జమ్మలమడుగు

వైభవంగా పెద్దమ్మ దేవర

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని ఎం.కంబాలదిన్నె గ్రామంలో పెద్దమ్మ దేవరను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం గ్రామ నాయకులు, కార్యకర్తల ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంవి.రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ చాపాల సుబ్బరాయుడు, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వై కోడూరులో ఎమ్మెల్యే పర్యటన

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వై కోడూరు గ్రామంలో ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఉగాది పురస్కరించుకొని ముందుగా గ్రామంలో ముద్దల పండగ నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జీ ఎం సురేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతకొమ్మదిన్నె : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొలుములపల్లె పాఠశాల ఆవరణలో ఎంఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటిలో శుక్లం ఉన్న వారికి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఎముకలు, కీళ్లు తదితరాలకు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ శిబిరంలో ఎంఎం హాస్పిటల్ ప్రవీణ్ కుమార్, ఎస్ఎం అబిద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం



గంగమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



ట్రాక్టర్‌లో అమ్మవారిని ఊరేగింపు చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులోని గంగమ్మ దేవాలయం కుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం నిర్మించి 25 ఏళ్లు కావడంతో ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, చండీ పారాయణాలు, మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు, మూలమంత్ర జప పారాయణాలు, మంగళహారతి నిర్వహించారు. గంగమ్మ విగ్రహాన్ని ట్రాక్టర్ మీదుగా పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నేత గంగిరెడ్డికి ఘన నివాళి



గంగిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రుద్రు గంగామోహన్‌రెడ్డి తండ్రి రుద్రు గంగిరెడ్డి ఆదివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి బుసిరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లి మృత దేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి గంగామోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ నరెడ్డి శివాంజనేయరెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసులురెడ్డి, సాంబశివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్ యాదవ్, శ్రీనివాసులురెడ్డి(వాసు), బాలగంగిరెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి సానుభూతి

కమలాపురం : వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్బయ్యగారి క్రిష్ణ(56) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదివారం మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్‌సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, మహ్మద్ సాదిక్, గఫార్, మోనార్క్, జిలానీ, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి

కొండాపురం : శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఎంవి. రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే ఆదివారం కొండాపురంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు శివారెడ్డి, పెద్దిరెడ్డి, చింతా రాజారెడ్డి, హరి, అల్లం సత్యం, అమరనాథ్‌రెడ్డి, నవజ్యోతిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీలు కుమార్, రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అంజనేయులు, రమణ కొండయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం : మండలంలోని జంగాలపల్లె, నెమళ్లదిన్నె, ఉప్పలూరు, బలపనగూడూరు, జె.కొట్టాలపల్లె గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. వెన్నపూస రవీంద్రారెడ్డి బంధువు మధుసూదన్‌రెడ్డి మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి రమణారెడ్డి, మండల కన్వీనర్ చవ్వా క్రిష్ణారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గ్యాస్ శివారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పి.లక్ష్మిరెడ్డి, కాంత్ రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చల్లంగ చూడమ్మా..!

- సత్యగంగమ్మకు ప్రత్యేక పూజలు



సత్యగంగమ్మ తల్లికి 101 బిందెల నీళ్లు పోస్తున్న మహిళలు

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన సత్యగంగమ్మకు మహిళలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. 'చల్లంగా చూడమ్మా' అంటూ అమ్మవారిని వేడుకుంటూ 101 బిందెల నీటిని పోసి మొక్కు తీర్చుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ప్రతి ఏడాది బాగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గంగమ్మతల్లిని వేడుకున్నట్లు భక్తులు తెలిపారు. అంతేకాకుండా చిన్నారులకు ఆటలమ్మ తల్లి, చికెన్‌పాక్స్ లాంటి వైరస్ ఎక్కువగా ఉన్నందున ఆ గంగమ్మతల్లి శాంతించి చిన్నారులందరినీ కాపాడాలని కోరామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు శైలజ, రెడ్డమ్మ, పద్మ, జ్యోతి, స్వాతి, సుజాత, ఊహ, ప్రియా, మల్లీ, లక్ష్మి, రత్నాలు, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముద్దల పండుగ

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లె, తలపనూరు, బసిరెడ్డిపల్లె, కొమ్మద్ది, అంకిరెడ్డిపల్లె, మొయిళ్లచెరువు గ్రామాల్లో నిర్వహించిన ముద్దల పండుగ ఆదివారం ఘనంగా ముగిసింది. గ్రామాల్లోని గ్రామ దేవతలకు జంతు బలులు సమర్పించి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. బసిరెడ్డిపల్లెలో బైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, గడ్డంవారిపల్లె సహకారం సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లెలో గంగిరెడ్డి, మొయిళ్లచెరువు సర్పంచు వెంకటరెడ్డి ఏర్పాటు విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని భాకరాపురం ప్రాంతంలో పర్యటించి పట్టభద్రులను ఓట్లను అభ్యర్థించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, రాజశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ చంద్రమౌళి, ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్‌నాయుడు, కోళ్ల భాస్కర్, రసూల్, శ్రీరాములు, తిరుపాలు, వెంకటలక్ష్మి, నజీర్, అశోక్, గృహ సారథులు, కన్వీనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక 1వ సచివాలయాల పరిధిలోని కాపువీధి, కారణాల వీధి, రెడ్డిరాజువీధి తదితర ప్రాంతాల్లో జెడ్పీటీసీ ఎమ్.రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ ఎన్.లక్ష్మిగాయత్రీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, రాజకుమార్, వార్డు సభ్యులు బండల షుకూర్, ముత్యాల అంజి, నాయకులు రెడ్డయ్య, అబ్దుల్ హకీం, సుధాకర్, మటన్ బాబా, జయరాములు, రాజా, నసీమ్‌బాషా, నిస్సార్ బాష, ఆసానయ్య, మనీగోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మోహన్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం : వైఎస్సార్ సీపీ బలపరచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి కోరారు. కమలాపురం పట్టణంలోని పలు వార్డుల్లో తిరిగి గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులను కలసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ఫాన్, ఇస్మాయిల్, మస్తానయ్య, ఖాజాహుసేన్, ఖాద్రి పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరులోని కొత్తగాంధీనగర్, అరుంధతినగర్, కొండపేట, రామనపల్లి గ్రామాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ప్రచారం చేపట్టారు. కొక్కరాయపల్లెలో మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆర్ఎస్ఆర్ ఆధ్వర్యంలో, రాచిన్నాయపల్లెలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాసీమబాబు, సర్పంచ్ సొంటం నారాయణరెడ్డి, కొండపేట సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, చెన్నూరు బ్రాహ్మణవీధిలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, సర్పంచ్ సిద్దిగారి వెంకట సుబ్బయ్య, ముదిరెడ్డిసుబ్బారెడ్డి, శ్రీనివాసరాజు, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- వైభవంగా రథోత్సవం

లింగాల : లింగాల పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాలలో వెలసిన గంగమ్మ దేవత తిరునాల ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున్నే పెద్ద కుడాల ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి తిరునాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మండల వాసులే కాక పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా, అనంతపురం, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తమ ఇలవేల్పును దర్శించుకున్నారు. అమ్మవారికి మహిళలు పెద్దసంఖ్యలో బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. జంతు బలులను ఇచ్చారు. పెద్దకుడాల గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

రథోత్సవ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొని రథాన్ని లాగి అమ్మవారిని వేడుకున్నారు. సకల సుభాలు జరగాలని ప్రార్థించారు. అలాగే చిన్నకుడాల గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి జంతుబలులను ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు.

భారీగా వెలసిన దుకాణాలు

పెద్దకుడాల తిరునాలలో తిరు బండారాలు, గాజులు, చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మల దుకాణాలు భారీగా వెలిశాయి. ఎస్ఐ హృషీకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బలగాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.

నమో లక్ష్మీనరసింహస్వామి

- ఘనంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి

వల్లూరు : వల్లూరు, కమలాపురం మండలాల సరిహద్దున పాపాఘ్ని నది ఒడ్డున మాచిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవ రోజైన ఆదివారం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వేద పండితులు ఆధ్వర్యంలో ఉదయం చతుష్టానార్చన నిర్వహించారు. అనంతరం ఆయుత నారాయణ అష్టాక్షరీ హోమాన్ని, నృసింహ హోమాన్ని చేశారు. సాయంత్రం లక్ష్మీ సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పుత్తా నరసింహారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారుల నృత్య ప్రదర్శన

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో సందర్శకుల ఆనందానికి ఆటవిడుపు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా హైకోర్టు డాక్టర్ జీ.రవీంద్రనాథ్‌శర్మ సౌజన్యంతో కడప ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ స్టూడియో మాస్టర్ సింహ వారి చిన్నారులతో నిర్వహించిన జానపదం, వెస్టన్ నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. బుట్టబొమ్మా బుట్ట బొమ్మా అంటూ సాగే పాటతో మొదలై చిన్నారుల నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సందర్శకులకు ఈ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

గండికోటను సందర్శించిన భవిత చిన్నారులు

వేంపల్లె : పర్యాటక కేంద్రమైన గండికోటను వేంపల్లె, పులివెందుల భవిత దివ్యాంగుల కేంద్రం చిన్నారులు సందర్శించారు. జిల్లా ఎస్ఎస్ఏ పీఓ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ బండి వీరారెడ్డి, ఐఈ కోఆర్డినేటర్ కేశవరెడ్డి సూచనల మేరకు తమ కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులతో గండికోటలోని పురాతన కాలంనాటి కట్టడాలను ఆదివారం సందర్శించి ఎంతో సంతోషంగా గడిపినట్లు ఐఈఆర్టీ కోటపాటి యశోద పేర్కొన్నారు. చిన్నారులలో ఉత్సాహం కలిగించే విధంగా ఈ పర్యటన సాగిందన్నారు.

అలాగే చిన్నారులు జోయా, ఆఫ్రిన్ పుట్టిన రోజు వేడుకలను దివ్యాంగుల చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంతోషంగా పాల్గొన్నారని వివరించారు. స్థానిక ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి ప్రయాణానికి అవసరమైన బస్సును ఏర్పాటు చేశారని, సిరాజుద్దీన్ భోజన ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ ప్రకాశమ్మ, సీజీవీ సుజాత, సిబ్బంది అబ్దుల్‌ఖాదర్, వెంకటేష్, మహేష్, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.